## క్లుప్తంగా

### ఓటర్‌గా నమోదు చేసుకోవాలి



**కల్వకుర్తి రూరల్:** ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని రైతు సమన్వయ సమితి తర్నికల్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ కోరారు. సోమవారం తర్నికల్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

### ఆత్మీయ కరపత్రాల విడుదల



**కోడేరు:** మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ దండోరా జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము మాదిగ ఆధ్వర్యంలో మాల, మాదిగ, ఉపకులాల ఆత్మీయ సమ్మేళన కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. ఈ 21న కొల్లాపూర్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి మాల, మాదిగ ఉపకులాలు ఎస్సీల్లో ఉండే 59 కులాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కల్మూరి రాములు, నరసింహ, రామకృష్ణ, మధు, యాదగిరి పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల పరిశీలన



**కల్వకుర్తి రూరల్:** మండలంలోని వెంకటాపూర్ తండాలో ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. చెరువులో ఒండ్రుమట్టి తీసే ప్రక్రియను వేగవంతం చేయాలని కూలీలకు సూచించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. ఏపీఓ చంద్రసిద్దార్థ్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

### పనులపై ఆరా..

**తాడూరు:** మండలంలోని పాల్మూరు గ్రామ పంచాయతీని సోమవారం ఎంపీడీఓ గంగామోహన్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఉపాధిహామీ ద్వారా నిర్వహిస్తున్న పనుల వివరాలను సర్పంచ్ నాగయ్యతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను పెంచాలని, పరికరాలపై అవగాహన కల్పించి ప్రతిరోజు 100 మంది కూలీలు పాల్గొనేలా చూడాలన్నారు.

**ప్రహరీ నిర్మాణ పనులు**

**కొల్లాపూర్:** పట్టణంలోని బండాయిగుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ పార్కు పనులు ప్రారంభమయ్యాయి. పార్కు నిర్మాణ ప్రాంతం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. పనులను సోమవారం 10వ వార్డు కౌన్సిలర్ రహీంపాష పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

### బోధనేతర సిబ్బందికి సెలవులు ఇవ్వాలి



**నాగర్‌కర్నూల్ రూరల్:** కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి వేసవి సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు డీఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి అందజేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని, కనీసం వేసవి సెలవులు కూడా ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, సుభాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

### రైతు ఆత్మహత్యాయత్నం

**కొల్లాపూర్ రూరల్:** పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం పెద్ద విద్యుత్ పోల్‌ను మండల పరిధిలోని ఎల్లూరుకు చెందిన వెంకటకృష్ణారెడ్డి వ్యవసాయ పొలంలో వేస్తున్నారు. దీంతో అతను, తన తమ్ముడు శ్రీరామ్ రెడ్డితో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పని కొనసాగుతుండగా.. అధికారులు, కాంట్రాక్టర్‌ను పని ఆపాలని కోరాడు. వారు పని ఆపకపోవడంతో వెంకటకృష్ణారెడ్డి వెంట తెచ్చుకున్న పెంట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. అది గమనించిన పోలీసులు అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా వెంకట కృష్ణారెడ్డి మాట్లాడారు. గతంలో కేఎల్ఐ, పాలమూరు ప్రాజెక్టుల నిర్మాణంలో మా భూమి పోయిందని, మళ్లీ పొలంలో విద్యుత్ పోల్స్ వేస్తూ.. భూమి లేకుండా చేస్తున్నారని వాపోయాడు. అతనిని పోలీసులు కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఆర్డీఓ హనుమానాయక్ సంఘటన స్థలానికి చేసుకుని పరిశీలించారు.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

**లింగాల:** సమస్యల సత్వర పరిష్కారం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ, మండల ప్రత్యేకాధికారి కృష్ణ ప్రజలను కోరారు. మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా పాల్గొని వినతులు స్వీకరించాలని కోరారు. ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఎం బాలస్వామి, గిరిజ, కృష్ణయ్య పాల్గొన్నారు.

**అధికారులు హాజరుకావాలి**

**చారకొండ:** ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి మండలంలోని ఆయా శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వ్యవసాయ, పశువైద్య, మహిళ సమాఖ్య, తదితర కొంత మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండలంలోని జూపల్లికి చెందిన రైతులు తమ వ్యవసాయ పొలంలోకి వెళ్లేందుకు నక్షబాట ఆక్రమణకు గురవుతుందని ప్రజావాణిలో వినతి అందించినట్లు చెప్పారు. త్వరలో అధికారులతో సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రజావాణిలో అధికారులు ఏఓ చిన్నాహుస్సేన్, మదర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



లింగాల ప్రజావాణిలో పాల్గొన్న డీపీఓ కృష్ణ, అధికారులు

**అధికారులపై చర్యలు**

**బల్మూర్:** ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తప్పవని తహసీల్దార్ కిష్ట్యానాయక్ సోమవారం తెలియజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి మండలంలోని కొన్ని శాఖల అధికారుల హాజరు కావడంలేదని, వారికి హాజరుకావాలని సూచించినా.. మార్పు లేదన్నారు. వారిపై జిల్లా అధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.



చారకొండలో ప్రజావాణికి హాజరైన అధికారులు

## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న గోపస్ లక్ష్మణ్

**తెలకపల్లి:** అధికారుల బెదిరింపులు అసత్య ప్రచారాలు, ఆటంకాల మధ్య వీఓఏల సమ్మె కొనసాగుతుందని, వాటికి బయపడకుండా సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని సీపీఎం, సీపీఐ నాయకులు గోపస్ లక్ష్మణ్, శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వీఓఏల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని, వీఓఏల కుటుంబాలు రోడ్డున పడుతున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 8 నుంచి 22 వరకు దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ మండల నాయకులు విజయ్‌గౌడ్, భాస్కర్, జగన్నాథం వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

### చెక్కు పంపిణీ



**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రానికి చెందిన గౌరమ్మ వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.60 వేల సీఎం సహాయనిధి చెక్కును మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజశేకర్, పరమేష్ పాల్గొన్నారు.

### నాయకుల నివాళి

**చారకొండ:** మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని దొంగలగుట్ట తండాకు చెందిన రాత్లావత్ గన్యానాయక్(58) ఆదివారం అనారోగ్యానికి గురై అకస్మాతుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జేపల్లి సర్పంచ్ రవీందర్ రెడ్డి, చారకొండ వైస్ ఎంపీపీ బక్కమ్మ పలువురు నాయకులు సోమవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

### తహసీల్దార్‌కు వినతి



**చారకొండ:** దేశంలో ప్రతిపౌరుడికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రభుత్వమే ఉచితంగా అందించాలని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు వినతి అందించారు. చంద్రశేఖర్, మల్లేష్, అయోధ్య, కొండల్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలి



**మన్ననూర్:** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతిచెందిన 7వ తరగతి దళిత విద్యార్థిని నిఖితకు న్యాయం చేయాలని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంఎస్ఎఫ్ నాయకులు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడారు. పాఠశాల తరగతి గదిలో ఉరేసుకుని మృతి చెందడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి తీర్చండి

**పెద్దకొత్తపల్లి:** నక్కలపల్లి స్టేజీ వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు దాహం తీర్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలల కిందట చేతిపంపు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి వెన్నచర్ల, రాయిపాకుల, నక్కలపల్లి గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నక్కలపల్లి స్టేజీ నుంచి నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, మండల కేంద్రానికి తరలి వెళ్తుంటారు. చేతి పంపు మరమ్మతు చేపట్టి ప్రయాణికుల దాహం తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**మరమ్మతు చేయిస్తా..**

నక్కలపల్లి స్టేజీ వద్ద చేతిపంపు మరమ్మతు విషయమై సర్పంచ్ రాధిక దృష్టికి తీసుకెళ్లగా.. చేతిపంపు మరమ్మతు చేయించి ప్రయాణికుల తాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని తెలియజేశారు.



## సబ్సిడీ గొర్రెలను సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దకొత్తపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం కురుమ యాదవుల సంక్షేమం కోసం అందజేయనున్న రెండో విడత సబ్సిడీ గొర్రెలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. చంద్రకల్, వెన్నచర్ల గ్రామాల కురుమయాదవులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెల కాపరుల లిస్టును వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెలను కాపరులు ఇతరులకు అమ్ముకోకుండా వాటిని సంరక్షించుకుంటే భవిష్యత్ బాగుంటుందని సూచించారు. జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, డా.మధు, ఆయా గ్రామాల కురుమ యాదవులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యప్రతాప్

## అంబేడ్కర్ జనజాతరను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అంతటి కాశన్న

**నాగర్‌కర్నూల్ రూరల్:** అంబేడ్కర్ జనజాతర కార్యక్రమాన్ని ఈ నెల 10న జిల్లాలోని సింగిల్‌విండో కార్యాలయంలో నిర్వహిస్తున్నామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న తెలియజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. మనువాద పాలకుల విధానాలతో అంబేడ్కర్ ఆశయాలు సమాధి అవుతున్నాయన్నారు. దేశంలో మెజార్టీ ప్రజలను చదువు, సంపద, ఆస్తులు, ఆభరణాలకు దూరం చేసిన మనువాదం మానవాళి మనుగడకే పెను ప్రమాదం అని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మధు, బుచ్చయ్య, రామకృష్ణ, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 11వ రోజుకు చేరిన సమ్మె



నాగర్‌కర్నూల్ వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



కల్వకుర్తిలో వంటావార్పులో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

**నాగర్‌కర్నూల్ రూరల్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం 11వ రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు.

**తెలకపల్లి:** గ్రామపంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారానికి 11వ రోజుకు చేరింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రొహిబిషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

**వంటావార్పు**

**కల్వకుర్తి రూరల్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేశారు. సోమవారం వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ పంచాయతీ కార్యదర్శులకు సంఘీభావం తెలియజేశారు.

## కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోండి

**లింగాల:** పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి రైతులకు సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కోమటికుంటలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సోమవారం చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. మండలంలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బచ్చన్న, దయానంద్, జయంత్‌రెడ్డి, శ్రీనివాసులు, పాండు రైతులు పాల్గొన్నారు.



కోమటికుంటలో ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

### సూచిక బోర్డులేవీ?

**అమ్రాబాద్:** మాదవానిపల్లికి వెళ్లే రోడ్డు లక్ష్మమ్మబండ సమీపంలో మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపు వద్ద ఎదురుగా ఈ వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రదేశంలో రోడ్డు వెడల్పు చేసి సూచికబోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



### కార్యదర్శులు లేక ఇబ్బందులు

**కోడేరు:** మండలంలోని పంచాయతీ కార్యదర్శులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 17 గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ శ్రవణ్ కుమార్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో సమస్య ఉందని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## గర్భిణులకు ఎనీమియా పరీక్షలు

**అచ్చంపేట:** ఐసీడీఎస్ ప్రాజెక్టు అచ్చంపేట ఆధ్వర్యంలో గర్భిణులు, కిశోర బాలికలకు సోమవారం ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. బొమ్మనపల్లిలో నిర్వహించిన క్యాంపులో గర్భిణులు, కిశోర బాలికలకు హెచ్‌బీ పర్సెంటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో మహిళలకు పలు ఆరోగ్య విషయాలను తెలియజేశారు. ముఖ్యంగా గర్భిణులు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటితో కలిగే లాభాలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహార పదార్థాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, సీడీపీఓ దమయంతి, కమల, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ దమయంతి

## కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

**నాగర్‌కర్నూల్ రూరల్:** వైద్య ఆరోగ్య శాఖలో, నేషనల్ హెల్త్ మిషన్‌లో జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ రోస్టర్ పద్ధతిలో నియామకమైన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియోద్దీన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతి అందజేశారు. ఏఎన్ఎంలకు ప్రసూతి సెలవులు లేకపోవడంతో నష్టపోతున్నారని అన్నారు. సీఎం అధికారంలోకి వచ్చాక కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండరని చెప్పి నేటికి పర్మినెంట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు సుగుణ, హైమావతి, కృష్ణవేణి, పరిమళ, పుష్ప, సావిత్రి, పద్మావతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

## దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

**లింగాల:** మండల పరిధిలోని మగ్దూంపూర్‌లోని దర్గాలో హజ్రత్ సయ్యద్ మగ్దూంషావలి గంధోత్సవం సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాతెహా అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కులమతాలకతీతంగా ప్రజలు దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీనివాస్‌రాథోడ్, వెంకటయ్య, మల్లయ్య, షఫీ, ముక్తార్ పాల్గొన్నారు.



దర్గాలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ప్రార్థనలు

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**బల్మూర్:** దేశాన్ని నడిపిస్తున్న భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి అందించాలని, అప్పుడే రాజ్యాంగంలోని విలువలపై అందరూ అవగాహన పొందుతారని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాయి మహారాజ్ అన్నారు. సోమవారం డీఎస్పీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరికీ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డా.బీఆర్ అంబేడ్కర్ పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నిర్మించిన భారత రాజ్యాంగంపై 90 శాతం మందికి అవగాహన లేక రాజ్యాంగంలోని ఫలాలను అందుకోలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిఒక్కరికీ రాజ్యాంగ పుస్తకాన్ని ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కిష్ట్యానాయక్‌కు అందజేశారు. రవి మహారాజ్, భాస్కర్, మహేష్, శేఖర్, గణేష్, అర్జున్, బాలయ్య, మల్లేష్, సైదులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

## యువ సంఘర్షణ సభకు తరలిన నాయకులు



తాడూరు నుంచి యువ గర్జనసభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగాల నుంచి యువ సంఘర్షణ సభకు వెళ్లిన యువజన కాంగ్రెస్ శ్రేణులు

**బిజినేపల్లి:** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంఘర్షణ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కూచుకుళ్ల సూహాసన్‌రెడ్డి, కొడిదల రాము, బంగిరి పర్వతాలు ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో బయలుదేరారు.

**తాడూరు:** యువ సంఘర్షణ సభకు కాంగ్రెస్ నాయకులు బాలగౌడ్, ఐతోల్ లక్ష్మయ్య, మద్దెలచంటి ఆధ్వర్యంలో యువకులు తరలివెళ్లారు. బద్రినాథ్, పరమేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**లింగాల:** కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన యువ సంఘర్షణ సభకు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

**వెల్దండ:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే యువ సంఘర్షణ సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మోతిలాల్‌నాయక్, మట్ట వెంకటయ్యగౌడ్, చంద్రమోహన్‌రెడ్డి, శేఖర్, జోగయ్య తదితరులు ఉన్నారు.

**మన్ననూర్:** మండలంలోని మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, మన్ననూర్, వటువర్లపల్లి తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు.

## మస్టర్లలో బినామీ పేర్లు చేర్చవద్దు

**లింగాల:** మండల పరిధిలోని వల్లభాపూర్, సూరాపూర్ గ్రామాల పరిధిలో ఉపాధి పనుల కోసం కూలీలు భారీగా తరలివచ్చారు. ఆయా గ్రామాల్లో అమలవుతున్న పనులను సోమవారం ఎంపీడీఓ గీతాంజలి పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతికూలీ పనులకు వెళ్లి జీవనోపాధి పొందాలని సూచించారు. మస్టర్లలో బినామీ పేర్లు చేర్చవద్దని, అలా జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, చెరువులు, కుంటల్లో ఒండ్రమట్టి, కట్టలపై చెట్ల పొదల తొలగింపు, రాళ్లను తీయడం లాంటి పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పనులు నిర్వహిస్తున్న సమయంలో ఇటీవల అక్కడక్కడ తేనెటీగల దాడులు జరుగుతున్నాయని, వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తగా పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. పనుల్లో ఎలాంటి యంత్రాలను వాడకూడదని తెలియజేశారు. వేసవి కాలం కావడంతో ఉదయం త్వరగా పనులకు వెళ్లాలని సూచించారు.



వల్లబాపూర్ శివారులో పనులు చేస్తున్న కూలీలు

### రైస్ మిల్లుల తనిఖీ

**కల్వకుర్తి రూరల్:** సివిల్‌సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నర్సింగరాజు సోమవారం పట్టణంలోని పలు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. మిల్లర్లు ఈ నెల 31వ తేదీలోగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యాన్ని గడువులోగా అందించాలని సూచించారు. ఇప్పటి వరకు ఏ మిల్లర్ ఎన్ని బియ్యం తెచ్చారో రికార్డులు పరిశీలించారు. గడువులోగా మిగిలిన బియ్యాన్ని పూర్తి చేయాలని మిల్లర్లకు సూచించారు.

